# ప్రజా ఆరోగ్యం–మౌలిక సదుపాయాలు

ఏ సమాజమైనా అభివృద్ధి చెందిందనడానికి ఆ సమాజంలోని ప్రజల ఆరోగ్య సూచికే గీటురాయి. అందుకనే మనిషి ఆరోగ్యం పాత్ర, విలువ ప్రముఖంగా ముందుకొచ్చింది. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి చెప్పినట్లు... ఆరోగ్యం మానవ హక్కుగా వుండాలి. ఆరోగ్యం అంటే కేవలం బతకడం, బతుకు భద్రత, రక్షణ కల్పించడం మాత్రమే కాదు. అదింకా విశాలమైనది. లోతైనదికూడా. పోషణ విలువలతో కూడిన సుఖవంతమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడమని అర్థం. కాబట్టి నిరాటంకమైన ఆర్థికాభివృద్ధిలో ఆరోగ్యం అత్యంత కీలకమైనది. వ్యాపార,లాభాపేక్ష కోణంలో నుంచి చూస్తే ప్రమాదం.

అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న నగరాల్లో విశాఖ నగరం ఒకటి. ఇక్కడ ఆరోగ్య రంగ సేవలను పరిశీలిస్తే ప్రభుత్వ వైద్యసేవలు 30 శాతం వుండగా, 70 శాతం ప్రయివేటురంగంలో వున్నాయి. ప్రభుత్వ బోధనాస్పత్రి ఆంధ్రామెడికల్ కాలేజీ సహా ప్రయివేటు బోధనాస్పత్రులు గీతం, ఎన్ఆర్ఐ, గాయత్రి వున్నాయి. కెజిహెచ్‌లో వైద్య నిపుణులతో అత్యధిక వైద్యసేవలు అందుతున్నాయి. కెజిహెచ్‌కు రోజుకు వచ్చే రోగులు సగటున 2వేల మందికిపైగా వున్నారు. పక్కన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వైద్యం కోసం కెజిహెచ్‌కు రోగులు వస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత కల్గిన కెజిహెచ్‌కు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు. దాని అవసరాలకు సరిపడా నిధులు విడుదల చేయడంలేదు. వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించడంలేదు. రోగ నిర్ధారణ పరీక్షలు పెంచడంలేదు. ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోలేదు. ప్రజా ఆరోగ్యం ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతోంది. పేదలకు మెరుగైన వైద్యసేవలందించగల్గిన ఇఎన్‌టి, ఘోషాస్పత్రి, రీజనల్ కంటి ఆస్పత్రి, మానసిక వైద్యశాలల పరిస్థితి ఇందుకు భిన్నంగాలేదు. కానీ రెండేళ్ల కోవిడ్ కాలంలో ఈ ఆస్పత్రులే వేలాది మంది రోగులకు సేవలు అందించి ప్రాణాలు నిలబెట్టాయి. ప్రయివేటు ఆస్పత్రులు ప్రజల భయాలను, రోగాల్ని సొమ్ము చేసుకొని కోట్ల రూపాయలు ఆర్జించాయి.

ప్రజా వైద్యరంగాన్ని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగుపర్చాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా బలహీనపర్చుతున్నాయి. ప్రజా ఆరోగ్యాన్ని ప్రయివేటు పరం చేస్తున్నాయి. వైద్య సేవలకు సంబంధించిన స్కీంలు కూడా ఇన్సూరెన్స్ ఆధారితమైనవి తప్ప ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యసేవలందించేలా లేవు. ప్రజారోగ్యానికి బడ్జెట్లో కేటాయింపులు తగ్గడంతో శాశ్వత ప్రాతిపదిక వైద్యనిపుణులు, సిబ్బందిని భర్తీ చేయడంలేదు. అన్ని విభాగాల సూపర్ స్పెషల్టి వైద్యులను నియమించి, సర్జరీలు సకాలంలో జరిగేలా చూడాలి. మందులు సరిపడా సరఫరా చేయాలి. రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య, సామర్థ్యం పెంచాలి. కోవిడ్ కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా పడకలు లేకపోవడంతో ప్రజాగ్రహానికి గురికాకుండా ప్రయివేటు ఆస్పత్రుల్లో వైద్యమందించాయి. కోవిడ్ గుణపాఠాలు ప్రభుత్వాలు తీసుకోవడంలేదు. ప్రభుత్వాస్పత్రుల ను బలోపేతంచేయడంలేదు.

విశాఖ నగరంలో 22 లక్షల జనాభావుంది. విశాఖ జిల్లాలో 10 పిహెచ్‌సిలు, నాలుగు మెడికల్ కాలేజీలు, 60కి పైగా అర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి. కొత్తగా ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్లలో సిబ్బంది నియామకం జరిగినప్పటికీ, అస్పత్రి భవనాల్లేకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందడంలేదు. 2020 మే 7న స్టైరిన్ గ్యాస్ లీకయిన వెంకటాపురం, పరిసర గ్రామాల ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. మరణాలు సంభవించాయి. ఈ ప్రాంతంలో ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి బాధ్యతను ప్రభుత్వం గాలికొదిలేసింది.

ప్రతీ వెయ్యి మందికి ఒక వైద్యుడు వుండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. అర్బన్ ప్రాంతంలో 30వేల మందికి ఒక పిహెచ్‌సి వుండాలి. అర్బన్ హెల్త్ సెంటర్లలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురాగలిగితే కెజిహెచ్‌కు రోగుల తాకిడి తగ్గుతుంది. ఏరియాలో సర్వేలు, క్షేత్రస్థాయిలో రోగాలను గుర్తించి అందుకు అనుగుణంగా పిహెచ్‌సిలో ఏర్పాట్లు చేయగలిగితే ఆరోగ్య విపత్తులను గుర్తించి నివారించవచ్చు. విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెన్(విమ్స్)లో సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు అందించాలి. పిజి వైద్య విద్య అందించాలి. జనరల్ వైద్య సేవలు అందించగలిగితే ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించి లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం పేదలకు తగ్గుతుంది. ఉత్తరాంధ్రలో వివిధ వ్యాధులపై విమ్స్‌లో పరిశోధన విభాగం ఏర్పాటుచేయాలి.

వైద్యసేవలు మెరుగుపడేందుకు ప్రజలను భాగస్వాములు చేయాలి. పీరియాడికల్‌గా సమావేశాలు నిర్వహించి వారి నుంచి సూచనలు తీసుకోవాలి. మందుల కొరతలేకుండా వ్యాధులను బట్టి నిరంతరం నాణ్యమైన మందులు సరఫరాచేసేలా ఏర్పాట్లు చేయాలి. డాక్టర్ సుజాతరావు కమిటీ సిఫార్సులు అమలుచేయాలి.

**టి.కామేశ్వరరావు**

**ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**